శ్రీరస్తు శుభమస్తు



# సాయి సచ్చరిత్ర

## (గురువారం పారాయణ)

**ద్విపద పాఠ్యము :**

**రచన :**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech



## ముందుమాట

భాషయొక్క ప్రధానోద్దేశ్యం భావ ప్రకటన. భావం అనుభవం వల్ల జనిస్తుంది. భావం ఎవరికి వారు పొందేది. ఆ భావం ఇంకొకరితో పంచుకోవటానికి సైగలు చేసేవాడు ఆది మానవుడు. సైగలనుంచి అరుపులు, అరుపుల నుంచి ఏకాక్షర పదాలు, అట్లా పెరిగి చివరికి భాష పుట్టింది. భాష సంస్కరించబడింది.

సంస్కరించబడిన భాష చాలా కాలం మౌఖికంగా (వ్రాతఉండదు)నే ఉండిపోయింది. ఈ నాటికీ అట్లా లిపిలేని భాషలు చాలా ఉన్నాయి. ప్రకటిత భావం భద్రపరచుకోవటానికి, సందేశం పంపించడానికి లిపి అవసరం అయింది. ఆ లిపి సంస్కరించబడింది. అన్యదేశపదాలు వచ్చిచేరాయి. సంస్కరించ బడుతున్న భాషను మనిషి అనుసరిస్తూనే ఉన్నాడు. మొదట్లో భాషలో



ధ్వని మాత్రమే ఉండేది. ఒక పద్ధతి ప్రకారం ధ్వని చేయుట వల్ల సంగీతం వచ్చింది. ఆ సంగీతం నుంచి పాట, పాటనుంచి పద్యం పుట్టాయి. ఆ పద్యాన్ని నియంత్రించటానికి ఛందస్సు పుట్టింది.

ఆ ఛందస్సు నియంత్రించిన భాష కవుల చేతిలో ఇరుక్కుపోయి సగటు మనిషి కేవలం చెప్పింది వినే దశకి వచ్చింది. పెద్దలు సగటు మనిషితో పనిచేయించుకుంటూనే అతని చేత పని చేయించుకోవటానికి రకరకాల ప్రక్రి యలు చేశారు. సగటు మనిషికి భావోద్వేగాన్ని కలిగించటానికి పద్యాలు, నాటకాలు, బుర్ర కధలూ ఇలా ఎన్నోవచ్చాయి. ఈరోజుకీ నిలిచి రాజ్యమేలుతున్న సినిమా సాహిత్యాన్ని చూస్తే



తేలిగ్గా అర్ధమయ్యేది ఇదే. మనిషి తన ఆనందానికి పుట్టినదాన్ని వదులుకోడు. మార్పు స్వీకరిస్తాడు.

అలా పద్య కవిత్వం సగటు మనిషికోసం మార్పు చెందుతున్న రోజుల్లో (500 ఏళ్ళ క్రిందట) వచ్చింది. 'ద్విపద'. ఇది పద్యమే కానీ పద్యంలో సగం. రెండేపాదాలు. అవి ఛందో బద్ధమైనవే. ప్రాసయతి గణ నియమాలు తు.చ.తప్పక పాటించాలి. కాని, పాదానికి నాలుగే గణాలుండటంవల్ల ఇది ఒక గీతంలా ఉంటుంది. ఇట్లాంటి ద్విపదలో శ్రీనాధుడంతటి వాడు పల్నాటి చరిత్ర వ్రాశాడంటే దీని ఆకర్షణ సగటు మనిషికి ఆ రోజుల్లో ఎంతటిదో అర్ధమవుతుంది. నేను పద్యకవిత్వం మీద మక్కువతో ఉడుతా భక్తితో ఈ మహా

సముద్రంలో ఒక ఉగ్గుగిన్నెడు నీళ్ళు పోశాను. ఒకరోజు ఆ పరమాత్మ దయ, ప్రేరణవల్ల ద్విపదలో ఏదైనా చేయాలనిపించింది. నేను సాయిఆరాధకుడిని గనుక సాయి సగటు మనిషిని ఉద్ధరించటానికి భువికి వచ్చిన దైవం కనుక సాయిచరిత్ర ద్విపదలో పారా యణ కోసం వ్రాద్దామనిపించింది. వెంటనే ఆలోచన ఆకారం దాల్చింది. అదే "సాయిసచ్చరిత్ర" ఈ ద్వపద రచన ఏడు రోజుల పారాయణ కోసం వ్రాశాను. ఇంతచిన్న పుస్తకంలో అంత చరిత్ర చెప్పలేనుగనుక, నిత్య పారాయణే దీని ఉద్దేశ్యం. కనుక సాయిచరిత్ర అతి క్లుప్తంగా ఉంది. అసలు ఆ చరిత్ర తెలియని భక్తుడి కోసం వ్రాశాను. చరిత్ర తెలిసినవారు తెలుసుకోగలిగిందేమీ లేదు కానీ పారాయణ చేయవచ్చు. పారాయణకన్న భక్తికి



పరాకాష్ట ఏముంది! బావిలోంచి ఎన్నినీళ్ళు తోడుకుంటే అంత ఉపయోగము అట్లాగే ఎంత పారాయణచేస్తే అంత పుణ్యము మనం ఎన్నిసార్లు బయటకొస్తే అన్నిసార్లు కాళ్ళు బురదయి కడుక్కోవాలి. బయటకి రాక తప్పదు. కాళ్ళు కడుక్కోకా తప్పదు. ఆ బురద అంటని వారెవరు? మరి అందుకే మనకి దైవ చింతన కన్న దారిలేదు.

చివర ఒకమాటతో నేనిది ముగిస్తాను. ఇందులో నేను కావాలనే మన తెలుగు 'వాడాను.' 'ఉపయోగించాను' కాదుసుమా ఎందుకంటే ఇది మీకోసం వైయాకరణ పండితుల కోసం కాదు.

జై సాయిరాం



## ప్రార్థన

సీ॥ శ్రీమంతులౌయాస చేరికొల్తురునిన్ను
ధనమిచ్చిగాతువు దయనుజూపి
ఆరోగ్యమును కోరి అల్లాడువారికి
ఆరోగ్యమిత్తువు అమితకరుణ
అలసిన ఇడుముల అవలీల దరిజేరి
వాటిని బాపెడివాడవీవు
ఆశించశాంతిని అదియొసంగెదవయ్య
శాంతికన్ననుమేలస్వర్గమయిన

ఆ॥ ఎవరివయ్యనీవు ఏది స్వస్థలమయ్య
ఏది పేరు నీకు ఎంతవయసు
ఎవరువైరి నీకు ఎవ్వారు చెలికాడు
ఎవరి ఊహ నిజము హే! మహేశా!



కం॥ మక్కువ దీరక వ్రాసితి
దిక్కగు ఆ సాయినాధు దీవెన తొలినే
మిక్కిలి ప్రేమతొ మార్చితి
చక్కగ ఆ 'అన్నమయ్య' సంకీర్తనలన్

ఉ॥ సాయి చరిత్రమున్ తెలుప సాధ్యమె?
పద్యకవిత్వమందు నే
చేయునదౌనా ఏమొ అదిచేయుట
ఖడ్గముపైన సాము నే
నీయెడ నింగి కెక్కుటకు ఈ విధినిచ్చెన
లేయుచుంటినా?
ఆయన ఆజ్ఞయై వెరపునందక వ్రాసితి
'సాయి' నామమున్

ఆ॥ ద్విపదనెన్నుకుంటి తెలుపసాయి చరిత్ర
కాలగర్భమందు కలిసియున్న
దానినెన్నుకున్న ధన్యత చేకూరు
షిరిడి వాసుడెంతొ చేవనిచ్చు

తే॥ గణము ప్రాసలు యతులను కాదనుటకు
వీలులేదాయె,వర్ణనవీలుకాదు
అన్యభాషలపదములు అవసరంబు
హ్రస్వదీర్ఘాలు మార్చితి అలుకవద్దు



# అంకితం

కం॥ చుండీ సుందరరామా!
అందగ నావెంటనుండ అల్లితి కవితల్
ఉండక సాయికి బోతివి
నిండిన కన్నులతొ దీని నీకర్పింతున్



# సాయి సచ్చరిత్ర
## ఒకటవ అధ్యాయము

శ్రీసాయి దయచేత 'చెప్పరా' అనగ
ఆ సాయికిని మ్రొక్కి అతి భక్తితోడ

సాయి చరిత నేను చక్కగా మీకు
నాయాస ఫలియించ నయము మీరంగ

ద్విపదలో చెప్పెద దివ్యమౌరీతి
ఆ పరంధాముని ఆనచేనేడు

ఎన్నడో కాలమే ఇవి మరచింది
ఎన్నుకుంటిని నేను ఇందులో వ్రాయ



మును పామరులు పాడిముదముగా ద్విపద
జనులకందించారు సంతసంబెంతొ

తప్పులుంటేనావి దయజూడరయ్య
ఒప్పులన్నీ సాయియొసగింది నిజము

ఎల్లవారినిగాచు ఈ సాయిఎవరు?
మల్లికార్జునుడయ్య మాశైవులకును

ఏరూపుకొలిచినా ఏ పేరునిడిన
ఆరాధనేవేరు 'అయ్య' ఒక్కండె

పరమత సహనమ్ము పాటించు వాడె
సరియైన భక్తుండు సాయికిప్రియుడు

## అవతరించిన ఆ బాలుడెవరు

మహరాష్ట్రదేశాన మారుమూలుంది
మహనీయు గ్రామమై మాబాగ షిరిడి

ఎనయ,పద్దెన్మిది ఏబదిలోన
కనపడెన్ తొలిసారిఘనుడు బాలునిగ

వేప చెట్టొక్కటి వేదికయ్యింది
ఎపుడు కలవడయ్యె ఎవరితో అతడు

ఎపుడుతిన్నది లేదు ఏరాత్రినైన
చాపల్యమేలేదు శాంత చిత్తుండు

నలుగురు వింతగా నానావిధాల
తలచినా మౌనమే దరి చేరడెవని

1.13

ఊరేదొ తెలియదు ఉన్న పేరేదొ
ఏరికీతెలియదు ఇదె చర్చ అయ్యె

ఒకనాడు 'ఖండొబా' ఉన్నట్టి గుడిలొ
మూక గణాచారి ముందుచేరారు

ఊరివారందరు ఉత్సాహమలర
వారికప్పుడు చెప్పె వాస్తవాలన్ని

ఒకచోటతవ్వగ బోధ చేయంగ
పెకలించు కొనివచ్చెవెలుగులోకపుడు

నాలుగు దీపాలునయము మీరంగ
మేలైనజపమాల మిత్రులున్‌జూడ

1.14

ఈపాపడిచ్చోట ఇదివరలోనె
తాపసై ఒంటిగా తపము చేశాడు

పన్నెండు ఏళ్ళుగా పరులకూడకనె
విన్నవారందరూ వింత జెందారు

పదియారు ఏళ్ళుండుబాలుడేరీతి
పదిరెండు ఏళ్ళుతపముజేయగలడు

దైవమీతీరుగ దివినుండి భువికి
అవతరించాడేమొ అనుకుంటిరంత

తిరిగికప్పిరి భూమి దేవుండనంచు
మరల మరల వాని మహిమ వేడారు

1.15

ఒకరోజు బాలుడు ఉన్నట్లు గానె
చీకాకు పడితాను షిర్డివీడాడు

## చాంద్‌పాటిల్ కథ

'చాందుపాటిలు' అనే సాయిభక్తుండు
పొందెసాయికరుణన్ పుణ్యమే 'పండ'

మునసబు'ధూప్ 'అనే మూలగ్రామముకు
తన అశ్వమే తప్పె దానికై వెతికె

'జీను' తో తిరుగుచు చింతనుండంగ
తానె ఆతని చేరె దయశాలి స్వామి

1.16

**“హయముకై వేదనన్ అందనేలయ్య**
**పోయి కాలువ వద్దవున్నది చూడు”**

పాటిలట్లే చేసి బడసి ఆ హయము
మాటరాకాతని మహిమ గుర్తించె

‘చిలుము’ పీల్చగ తనన్ చేరబిల్వంగ
చెలిమితో దరిజేరె శ్రీచాందుగారు

నీరు కావాలయ్యె నిప్పుకావాలి
నీరు చిమ్ముచు వచ్చెనేలపై కొట్ట

ఇనుప చువ్వతొ, తవ్వి ఎనయించె నిప్పు
చెనకొని వెలిగించె చిలుమును ఘనుడు

1.17

వేడెను ‘పాటిలు’ విభునుండనచటె
కూడితానుండెను గురువౌచు స్వామి

చాందు సతీమణి సహజన్మకొడుకు
పొందుగా పెండ్లికై పురము షిర్డీకి

తరలిరి అందరూ తాకూడెస్వామి
వారితో జతగూడి వచ్చె షిర్డీకి

## ‘సాయి’నామకరణము

‘భక్త మహాలసాపతి’ గారి పొలము
శక్తిశాలీస్వామి చక్కనౌ విడిది

1.18

స్వామి నాహ్వానించె ‘సాయి’ రావయ్య
ఆమాట నాటితో అయ్యె స్థిరంబు

మూడేళ్ళక్రిందట మునుమాయమయ్యె
చూడదర్శనమిచ్చె చుట్టమైనేడు

షిరిడి వాసులు తాము చేసిన పూజ
లరయ సాధ్యంబౌనె ఆ మాట నిజము

పెళ్లివారందరూ వెళ్ళినాగాని
కళ్ళకు వెలుగౌచు ఘనుడుండెనచటె

1.19

కుదిరించె మాయగా కుష్టురోగంబు
వదిలించె రుగ్మతల్ బాధితులకును

బట్టకట్టేతీరు ‘వస్తాదు’ లాగ
చుట్టమై ఆర్తులన్ చూచునాతండు

‘శ్యామా’ అనేవాడు సాయిభక్తుండు
ప్రేమ ‘దేవా’ యంచు పిలిచేటివాడు

## షిరిడీలో స్థిర నివాసం

‘జానకీదాసుడు’ సాయిగొల్చేను
మనె, ‘మహాల్సాపతి’ మంచి  శిష్యునిగ

1.20

‘తాత్యా’ అనేవాడు తల్లితోగూడి
నిత్యమూ పూజించె నీవెదిక్కనుచు

ఎండలో వెదకుచు ఈ సాయికామె
నిండగా కడుపుకు తిండి పెట్టేది

పూలమొక్కలు తెచ్చి పూనికన్ సాయి
మేలైన తోటను మెల్లగాపెంచె

షిరిడి నందవని చేసెనాసాయి
తిరుగాడె మాలిగా దివ్యుడాసాయి

1.21

## గెలుపు ఓటములు రెండూ ఒక్కటే

గెలుపు ఓటములతో కీర్తిమంతులకు
విలువలేదని చెప్పె విశ్వాత్మకుండు

మల్లయుద్ధము చేసి మల్లు ‘తంబోలి’
వల్ల ఓటమి పాలపడెను ఆ సాయి

అది లీలకాకున్న అగునే నిజంబు
కుదియించగలవాడు గొప్పగాసాయె

వేషధారణ మార్చె విశ్వాత్ముడైన
ఆ షిర్డివాసుడు ఆనాటినుంచి

1.22

బిగువైన ‘లంగోటి’, పెద్దదౌ ‘కఫని’
సిగపైన ధరియించె చిత్రమౌ పాగా

ఎడమవైపున చుట్టెఎంతో ఘనముగ
‘పిడప’ గా సాయి కే విలువైనగురుతు

గోనెతుండు పరచి కూర్చుండు సాయి
కానవచ్చెడి దేవుగానిలిచె తాను

మహిమలెన్నో చూపి మానవాళికిని
సహనమ్ము నేర్పాడు శాంతి బోధించి

నమ్మినవారికి నయములు జరుగు
నమ్మనివారిని నమ్మించనేల

1.23

## ధౌతీ ఇలాచేయగలరా

యోగశక్తితొసాయి యొనరించెనెన్నొ
బాగైన లీలలు బాగుగావినుడు

‘ధౌతీ’ అనే విద్య తక్కినందరును
చేతురు గుడ్డను చేర్చిగొంతుకను

సాయి ‘ధౌతిని’ చూడ సాధ్యమే కాదు
సాయి ఊపిరితిత్తి చక్కగా తీసి
ఎండబెట్టును బైట ఇంతియెగాక
నిండుగా అమరించు నిపుణతన్ తిరిగి

దీనిచూచిన వారు తెలిసి ఆ యోగి
ఘనమైన శక్తిని, కని భక్తులయిరి

1.24

## ఖండయోగం కడుభయంకరం

ఖండయోగమునందు ఘనుడైనసాయి
ఖండించుకొని తన కర్మేంద్రియములు

తిరిగి అమరజేయు దివ్యమౌరీతి
అరయ భీకరమైన ఆ విద్యజూపి

మంత్రముగ్ధుల జేయుమహిమనుజూపి
తంత్రమేమోగాని ధన్యులన్జేసె

ఆరబెట్టినయట్టి అవయవాల్జూసి
వెరపందినొక్కడు వెనుదిరిగాడు

బాబాను ఎవ్వరో వధియించినారు
కాబట్టి మౌనమే కడు శ్రేష్ఠమనుచు

1.25

మెల్లగా పోయె ఏమెరుగని రీతి
చల్లగా వచ్చాడు సాయినీజూడ

భయపడనేలరా బాగుగానుంటి
ఆయనచూపులు అడుగునట్లుండె

ఇటువంటి లీలలు ఎన్నియోకలవు
పుటలకు మితిగాని వున్నదా అంతు

## శవమా? దైవమా

అది, పదినెనిమిది ఆరు మార్గశిర
మాది పౌర్ణమా సాయి అలరించె మహిమ

భక్తమహాలసాపతి నొక్కనాడు
భక్తవరదుడుతా పనివేళపిలిచె

1.26

**మామ! నా మాటను మన్నించవయ్య**
**నామేను కాపాడు నయముగా నీవు**

**మూడురోజులపాటు ముఖ్యుడై నీవు**
**కడగి కాపాడుము కర్తవ్యమనుచు**

నేలపై కట్టెలా నెలకొనెన్ మేను
చలియించిరందరున్ చనిపోయెనంచు

ఊపిరే లేకుండె ఉండెకట్టెవలె
కాపాడుటేరీతి కట్టె దేహంబు

భక్తుండు మాత్రమే బహుశ్రద్ధతోడ
భక్తితోకాపాడె భవ్యదేహంబు

1.27

మూడురోజులు కాగ ముదముగా లేచె
నడియాడె నాసాయి నగవుచూ తిరిగి

పరకాయ విద్యనే బడసెసాయనుచు
వరభక్తులున్నేర్చి భక్తిమొక్కేరు

యోగికసాధ్యంబు ఉండదేదియును
యోగిరాజుకు కానిదుండునే భువిని

## దీపాలకి నూనెకావాలా

దీపాలు వెలిగించ తైలంబుకొరకు
ఆ పురివ్యాపారులందరిన్ సాయి

1.28

అడిగితైలము తెచ్చి అందంబుగాను
అడయించెచీకట్లు ఆ మసీదునను

మసిజీదు అంతట మహిమాన్వితుండు
చేసె వెల్గుల రాసి చెనకొని శోభ
వ్యాపారులందరువల్లకాదనుచు
చెప్పుటెట్లోఅని చింతించినారు

మరునాడు సాయితో 'మావద్దలేదు'
తిరిగిపొమ్మన్నారు తైలంబునీక

నవ్వెను ఆ సాయి నవమోహనముగ
అవ్వెన్క దీపాలనపుడు నింపారు

1.29

నీటి పాత్రను తెచ్చి నీరు త్రాగాడు
నీటిలో ఉమ్మి ఆ నీటితో నింపి

దీపాలు వెలిగించ దిమ్మెరవోయి
కాపాడుమనివేడి కాళ్ళబడ్డారు

**తెలియుడుజనులార దీపకాంతెపుడు**
**కాలగ వత్తులు కలిగించువెలుగు**

**పరులకై జీవించి వారికిమేలు**
**జరుపగా కలుగునుశాంతి ఎల్లపుడు**

1.30

**తప్పుచేసినవారు దానిని తెలిసి**
**ఎప్పుడూ చేయక హితవు చేయాలి**

జ్ఞానబోధను చేయ సాయినాధునికి
ఏనాడు సరిలేరు ఇలనంతటికిని

గురుదేవుడాసాయి కూడికాపాడు
శరణని వేడిన చాలును, నిజము

## ఎవరినీ ద్వేషించరాదు

'రోహిల్ల' అనువాని రోతౌ నమాజు
సహచరుల్ భయపడి చచ్చునట్లుండు

1.31

బాబాను చేరుచు బాధతో తెలుప
బాబానుడివిరిట్లు వదలండివాని

**గయ్యాళి భార్యతో గడుపు జీవితము**
**అయ్యాతనిన్ జాలి అరయంగవలదె**

బాబా చమత్కార పరిధి చూడండి
ఆ బడుగునకెట్టి ఆలియున్ లేదు

పాపమాతని గొంతు వదలునే వాని
ఆ పత్నిరీతిగా అంతమౌ దాక

తలకొక్క వెతయుండు ధరణి జీవులకు
వలనుకాదది వీడ బ్రతికుండువరకు

1.32

## గంగా యమునలు కాళ్ళనుంచి

ఆనాడు అలరారె ఆ మహారాష్ట్ర
ముననొక్కహరిదాసు ముఖ్యుడాతండు

దాసుగణుడు పేరు తనుసాయి కొలుచు
అసమానభక్తితో ఆ సాయినెపుడు

తలచెను వెడలనై తాను ప్రయాగ
కలియసాయిని వచ్చె కరుణించమనుచు

గంగ యమున కూడు ఘనమైనయట్టి
సంగమంబయ్యది చాల ప్రసిద్ధి

1.33

సాయినవ్వుచు బల్కె **శ్రమయేలనయ్య**
**చేయరాదా యిట శ్రేష్టమౌరీతి**

**నీకోరు స్నానాలు నీవుండివిచటె**
**నీకోసమానదుల్ నేను తెప్పింతు**

పాదయుగ్మమునుండి ప్రవహించసాగె
ఉదకంబు కాలువై ఉప్పొంగిరాగ

చెమరించె కన్నులు చెప్పెనాసువుగ
కమనీయ స్తోత్రంబు ఘనముగా నచటె

1.34

## శ్రీసాయిబాబా ప్రార్థనాష్టకమ్

1. శాంతచిత్తా మహాప్రజ్ఞా సాయినాధా దయాధనా
దయాసింధో సత్యస్వరూప మాయాతమవినాశనా॥
2. జాత గోతాతీతా సిద్ధా అచింత్యా కరుణాలయా
పాహిమాం పాహిమాం నాథా శిరిడి గ్రామనివాసియా॥
3. శ్రీ జ్ఞానార్క జ్ఞానదాత్యా సర్వమంగళ కారకా
భక్త చిత్త మరాళా హే శరణాగత రక్షక॥
4. సృష్టికర్తా విరించీ తూ పాతాతూ ఇందిరాపతీ
జగ్రతయాలయానేతా రుద్రతో తూచ నిశ్చితీ ॥
5. తుజవీణే రితాకోఠే ఠావనాయా మహీవరీ
సర్వజ్ఞతూ సాయినాధా సర్వాంచ్యా హృదయాంతరీ॥
6. క్షమా సర్వపరాధాంచీ కరానీ హేచీమాగణే
అభకి&త సంశయాచ్యాత్యాలాటా శీఘ్రనివారిణే॥
7. తూధేను వత్సమీతాన్హే తూ ఇందుచంద్రకాంత మీ
స్వర్నదీరూప త్వత్పాదా ఆదరేదాసహా సమీ॥
8. ఠేవ ఆతా శిరీమాజ్యా కృపేచాకర పంజర
శోకచింతా నివారావీ గణూహా తవకింకర

**జయ జయ సాయి సద్గురు పరమాత్మ సాయి**

1.35

(అత్యంత మహిమాన్వితమైన ఈ ప్రార్ధనాష్టకమును నిత్యమూ పఠించు భక్తులకు శ్రీ సాయి అనుగ్రహము వలన అన్నికోరికలు సత్వరముగా సిద్ధించునని పెద్దల వాక్యము)

## శ్రీ రామనవమి చేద్దాం రండి...

'గోపాలరావ'నే గొప్ప భక్తుండు
పాపమతడు సంతుబడియనేలేదు

'దామూ' అనేవాడు తనుకూడ అటులె
ఏమినోచినగాని ఎరుగండు బిడ్డ

బాబా శరణు వేడి ప్రార్థించినారు
బాబా కరుణ వల్ల బడసిరిసంతు

1.36

ఆనందమే తాక అంబర సీమ
ఆనాటితో సాయికర్పించిరన్ని

నిండైన మనసుతో నిజభక్తులైరి
'జెండా'ను ఇప్పించి జేజె అన్నారు

శ్రీ రామనవమిని చేయదల్చారు
చేరె, 'నిమోన్కరు' జెండాను ఇచ్చె

ఉన్నవే షిర్డిలో ఉదకంబునిచ్చు
చిన్నబావులురెండు చేయుటఏమి

మంచినీరుండేటి మంచిదౌ బావి
మంచి వేసవిలోన మానక ఎండు

1.37

రెండవ బావిలోనుండు నీరంబు
నిండియు లవణాన నిరుపయోగంబు

చేరుకుందురు చేయ శ్రీరామనవమి
నీరునిచ్చుట ఎట్లు నిందరాకుండ

సరిజేసె ఉప్పును సాయినాధుండు
వెరపేల అనుచును వేసిపుష్పాలు

సలిలమయ్యెను బావి సాయి దీవెనతొ
పలికిరి జేజేలు పరమాత్ముడనుచు

అయిననూ ప్రజహెచ్చి ఆషిర్డిలోన
పోయించవలసొచ్చె ఉదకంబువెలకు

1.38

'తాత్యా' అమరజేసె తాజేరి అచట
నిత్యావసరములు నేర్పుతో చూసె

శ్రీ రామనవమన్న షిరిడిలో గొప్ప
పేరున్న పండుగ పురిని నేటికిని

## చందనోత్సవం

చందనోత్సవమును చక్కగా జరుపు
కొందురు ముస్లిమ్‌లు కోర్కెతీరంగ

ముస్లిముల్ జరిపెడి ముచ్చటయ్యెదియె
ముస్లిం ఫకీర్లను ముఖ్యులన్ కొలువ

1.39

ఊరేగి కొనిపోయి ఒక్క పల్లకిలొ
పురవీధులందున పూని ఎల్లరను

నింపి చందనముతో నిండు పళ్ళెరము
నింపుచున్ మది భక్తి 'నింబారు'పైన

మసిజీదు గోడపై మతపెద్దలంత
పూసి చందనమును ఉత్సాహమలర

ధూపముల్ సాంబ్రాణి తోనిండు వీధి
ఆపలేనట్టిదౌ ఆనందమలర

శ్రీరామ నవమికై చేరు'హిందువులు'
ఊరేగు ముస్లిముల్ ఒక్కటైనట్లు

1.40

మతసామరస్యంబు మన్ననల్ హెచ్చు
జతకల్పెనా రీతి సాయినాధుండు

పదివేలమందైన పంతాలుపోక
కుదిరించెనాసాయి కూడి రొక్కటిగ

ఒకలాగెపుట్టుక ఒకలాగె చావు
ఒకలాగె జీవించ ఉన్నతంబవదె

సాయినాధుని మాట సత్యంబుకాదె
ఈ యిలన్ దేవుండు ఎరుగనొక్కండె

సర్వేశ్వరుడుసాయి సాకారుడైన
సర్వోత్తముని గొల్చి చరియించ వలెను

1.41

చీకటి దారిలో చేరగమ్యంబు
చేకూర్చునాసాయి చేయూతనిచ్చు

## ప్రేమావతారునికి
## ప్లేగు ఒకలెక్కా?

'ఖాపర్డె' అనువాడు కడు భక్తి కొలిచి
కాపాడమనివేడె కన్నీటితోడ

తన సుతునకు 'ప్లేగు' తగిలిబాధిల్ల
తన సతితో వేడె దయజూపమంచు

శరణు వేడిన వారి సాయితోడగును
కరుణించి తను గొ౦ కఠినమౌ వ్యాధి

1.42

తన'కఫనీ' యెత్తి తాజూపె సాయి
తన ఒంటిపై 'ప్లేగు' తనుగొన్న వ్యాధి

భక్తులార వినుడు భయమొందవలదు
భక్తులన్ విడువడు బాధలెన్నైన

వారి వ్యాధులుగాని బాధలేగాని
భరియించి కాపాడు వాడంచు నమ్మి

'అల్లా భలా' చేయు అందరికంచు
ఎల్లరూ వినరండి ఈ సాయి మాట

1.43

## నిప్పులో పడినా భయంలేదు...

చావును తప్పించు జనకుండు సాయి
అవని ఆయన దయన్ అవును ఏదైన

దీపావళీనాడు దివ్యుడాసాయి
కాపాడె భక్తుని కరుణతో పూని

'ధుని' వెలిగించుచు తొందరజేసి
తనచేయి నిప్పులో తాను పెట్టంగ

కాలినచెయి చూచి కన్నీటితోడ
**ఏల చేసితివిట్లు** ఏడ్చెను 'శ్యామ'

1.44

‘శ్యామాను’ ఓదార్చి సాయినాధుండు
ఈ మాటజెప్పెను ఎరుగభక్తుండు

**దవ్వున భక్తుండు దయవేడినాడు**
**నువ్వెనాదిక్కంచు నోరార బిలిచి**

**కన్నీరు మున్నీరుగాను ఏడ్చాడు**
**చిన్నపాపడు జారి చితిలోనబడగ**

**కుమ్మరివాడైన గుణవంతుడతడు**
**రమ్మన్న సాయికి రాకుండుటగునె?**

**నను నమ్మువానిని నాదయజూసి**
**పూనిరక్షించెదన్ వుండితోడుగను**



‘భాగోజి’ అనువాని భాగ్యంబదేమొ
తాగూడి సాయికి తన చేతితోటి

వెన్న రాయుచుగొల్చె వేల్పు చేతికిని
తన్నట్లు కరుణించె ధన్యునిన్‌జేసి
కొన్నాళ్ళతరువాత కుమ్మరి ఒకడు
కన్నీటితో మొక్కిగాధను తెలిపె

**నాబిడ్డ కాపాడిననుకడతేర్చి**
**నా బాధతీర్చావు నాధ ఓ సాయి**

నిప్పునుండీకాచు నెనరుతోసాయి
ఎప్పుడైనా గాని ఈవెదిక్కన్న



## కనిపించిన దైవం.....

సాయి చెప్పిన మాట చక్కగావినుడు
చేయెత్తి మొక్కుచు సిరికల్గునటుల

‘అల్లా’యె ఆ సాయి ఆయనే ‘యేసు’
ఎల్లరు కొలిచేటి ఈశ్వరుండతడే

వానిచేరెడిదార్లు, వందలున్నాయి
పూనుడు ఏదేని పుణ్యమేకలుగు

సాయిగాధలు విన్న చదివినాగాని
సాయి కీర్తిని పాడి చక్కగా కొలిచి



పరమాత్మ దయగొనేబాట అయ్యదియె
పరమగురుడు చెప్పు బాటయేమేలు

గురువారమున సాయిగురుదేవు గాధ
కోరి చదివినను కూడునేదైన

షిరిదీనివాసుడు చెప్పిన నీతి
నెరపిన కలుగును నీకెంతొ శుభము

**ఒకటవ అధ్యాయము**

**శ్రీసాయినాధార్పణమస్తు**
**ఓం నమో భగవతే సాయినాధాయ**